

రంజిత మృతిపై 5 బృందాలతో దర్యాప్తు : ఎస్పీ మీనా 7



కలెక్టరేట్‌లో డీఆర్వో మాధవి ఆధ్వర్యంలో వందేమాతర గీతం



జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో వందేమాతర గీతాలాపన

ప్రజల్లో స్ఫూర్తి, ప్రేరణ నింపిన

వందేమాతరం

అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్

జిల్లా ఎస్పీ కార్యాలయంలో 150 ఏళ్ల వందేమాతరం గీతాలాపన

కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో డీఆర్వో మాధవి ఆధ్వర్యంలో వేడుకలు

అమలాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయభావాన్ని ప్రతిబింబిస్తూ కార్యాలయంలో ఉన్న భారతమాత చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు కార్యాలయంలో అధికారులు, విద్యార్థులతో కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అశేష ప్రజానీకానికి వందేమాతర గీతం గొప్ప స్ఫూర్తి, ప్రేరణను ఇచ్చిందని, దీన్ని రచించిన బకింగ్‌చంద్ర చటర్జీని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీసీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఏఆర్‌ఆర్‌ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులను అదనపు ఎస్పీ అభినందించారు.

డీఆర్వో మాధవి ఆధ్వర్యంలో..

ఆంగ్లేయుల అకృత్యాలను చూసి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలని బకింగ్‌చంద్ర చటర్జీ సంకల్పించి వందేమాతర గీతాన్ని రచించారని, ఇది జాతీయోద్యమ చైతన్య జీవనాడిలా నిలిచిందని డీఆర్వో కె.మాధవి పేర్కొన్నారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ గేయ రచయిత బకింగ్‌చంద్ర చటర్జీల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సామూహికంగా విద్యార్థులతో గీతాలాపన చేశారు. అదేవిధంగా ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హోదాలో మాధవి వందేమాతరం గీతాలాపన చేశారు. పలువురు సెక్షన్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

కడలి.. కెరటమై..



అంతర్వేది తీరంలో ఉన్న లైట్‌హౌస్ చుట్టూ సముద్రపు నీరు



- తీరాన్ని కబళిస్తున్న సంద్రం
- చారిత్రక కట్టడాలకు పొంచి ఉన్న పెనుముప్పు
- అంతర్వేది లైట్‌హౌస్‌ల చుట్టూ నీరే
- ఓడలరేవులోని ఓఎన్జీసీ టెర్మినల్‌కూ తాకిడి
- భారీగా కోతకు గురవుతున్న సముద్ర తీరం
- ఆందోళనలో తీర గ్రామాల ప్రజలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాత సముద్ర తీర ప్రాంతంలో ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలల తాకిడికి చారిత్రక కట్టడాలతోపాటు చమురు సంస్థల ఆస్తులకూ పెనుముప్పు పొంచి ఉంది. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావం, అలాగే గత కొన్నేళ్ల నుంచి అల్పపీడనాలు, తుఫాన్ సమయాల్లో సముద్రపు కెరటాలు ఎగసి పడుతుండడం వల్ల తీరం భారీగా కోతకు గురవుతోంది. గత రెండున్నర దశాబ్దాల కాలంలో సుమారు కిలోమీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చి సారవంతమైన భూములను కడలి గర్భంలో కలిపేసుకుంది. తీర రక్షణ కోసం పెంచుతున్న మడ అడవులు సహా సర్వే కర్రల తోటలు కనుమరుగైపోతున్నాయి. ఇటు అంతర్వేది నుంచి అటు పాండిచ్చేరిలోని యానాం వరకు ఉన్న సుమారు 90 కిలోమీటర్ల మేర సముద్ర తీరం అనూహ్య మార్పులతో తీరాన్ని కడలి గర్భంలో కలుపుకోవడంతోపాటు లైట్‌హౌస్ వంటి చారిత్రక కట్టడాలు సైతం కుప్పకూల్చేందుకు ముప్పు పొంచి ఉంది. దీనికి తోడు అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీరం వెంబడి వందల కోట్లతో నిర్మించిన ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌కు కూడా ప్రమాదం పొంచి ఉంది.

అంతర్వేది లైట్‌హౌస్‌కు ముప్పు..

అంతర్వేది నుంచి యానాం వరకు ఉన్న 90 కిలోమీటర్ల సముద్ర తీరం ఇటీవల భారీగా కోతకు గురవుతోంది. ఈనేపథ్యంలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది తీరప్రాంతంలో దశాబ్దాల కిందట నిర్మించిన చారిత్రాత్మక కట్టమైన లైట్‌హౌస్ మనుగడ ప్రశ్నార్థకమైంది. పాత లైట్‌హౌస్ స్థానే కొత్తగా మరో లైట్‌హౌస్ నిర్మాణం కూడా చేపట్టారు. అయితే సముద్రంలో వచ్చిన మార్పుల వల్ల కెరటాల తాకిడికి వీటికి ప్రమాదం పొంచి ఉంది. అలలు లైట్‌హౌస్‌ను సైతం తాకే పరిస్థితులు రాగల ముప్పుకు సంకేతంగా ప్రజలు పేర్కొంటున్నారు. పూర్వం ఉండే ఓ లైట్‌హౌస్ ఆనవాళ్లు ఇప్పటికే సముద్రంలో కలిసిపోయి అరకిలోమీటరు దూరంలో నేటికీ మొండి గోడలు తీరంలో కనిపిస్తుంటాయి. ఇప్పుడు అన్నాచెల్లెలు గట్టుగా పిలిచే వశిష్ఠ నదీ చెంతన ఉండే లైట్‌హౌస్ సముద్రంలో నావిగేషన్ కోసం పనిచేస్తోంది. ఓడలకు, బోట్లకు దిక్సూచిగా ఉపయోగపడే ఈ లైట్‌హౌస్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుండడం స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది.

ఆన్‌షోర్ టెర్మినల్‌కు ముప్పే..

అల్లవరం మండలం ఓడలరేవులో వందల కోట్ల రూపాయల వ్యయంతో చమురు, సహజ వాయు సంస్థ గల కొన్నేళ్ల నుంచి ఆన్‌షోర్ టెర్మినల్ ద్వారా చమురు, సహజవాయువుల అన్వేషణ, సరఫరా కొనసాగిస్తుంది. అయితే ప్లాంటు నిర్మాణ సమయంలో కిలోమీటరు దూరంలో ఉండే సముద్రం ఇప్పుడు ముందుకు చొచ్చుకు వచ్చి ప్లాంటు చుట్టూ నిర్మించిన రక్షణ గోడను ఛిద్రం చేస్తోంది. గోడ చుట్టూ నిర్మించిన రహదారి ఇప్పటికే కడలి గర్భంలో కలిసిపోయింది. వందల కోట్ల విలువైన ఈ ప్లాంటుకు సముద్రం నుంచే ముప్పు పొంచి ఉంది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్ల వంటి విపత్తుల సమయాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారి ముందుకు చొచ్చుకు వస్తుండడం వల్ల ప్లాంట్లలోకి నీరు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే చుట్టూ ఉన్న రక్షణ కట్టడాలు ధ్వంసమయ్యాయి. అక్కడే ఓడలరేవులో ఉన్న సముద్ర రిసార్ట్స్ సమీపంలో వేసిన తాత్కాలిక రక్షణ షెడ్లు కుప్పకూలాయి. తీరం భారీగా కోతకు గురవుతుంది. అదేవిధంగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలోని ఆన్‌షోర్ ప్లాంటు అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ చుట్టూ సముద్రపు అలల తాకిడి వల్ల ఇటీవల తుఫాన్ సమయంలో జల దిగ్బంధానికి గురైంది. తీరంలో కోత అనూహ్యంగా పెరుగుతుండడంతో రానున్న రోజుల్లో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



అల్లవరం మండలం ఓడలరేవులో ఓఎన్జీసీ ఆన్‌షోర్ ప్లాంటుకు పొంచి ఉన్న ముప్పు

నేడు డీఆర్సీ

- నేడు కోనసీమ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం
- హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు
- తుఫాన్ నష్టాల అంచనాలపైనే ప్రధాన చర్చ
- డ్రెయిన్లు, స్ట్రయిట్‌కట్‌ల పునరుద్ధరణ అంశాల ప్రస్తావనకు ఎమ్మెల్యేలు సిద్ధం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధ్యక్షతన కీలకంగా జరగనుంది. జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, వైసీపీ ప్రజాప్రతినిధులు హాజరయ్యే ఈ సమావేశంలో ప్రధాన అంశాలు చర్చించనున్నారు. అచ్చెన్నాయుడు శనివారం ఉదయం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గోదావరి భవన్‌లో జరిగే డీఆర్సీ సమావేశానికి హాజరై ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించనున్నారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన నష్టాల అంచనాలపై ప్రధానమైన చర్చ జరగనుంది. ముఖ్యంగా వ్యవసాయశాఖ మంత్రి హోదాలో ఉన్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానశాఖలకు జరిగిన పంటల నష్టాల అంచనాలతోపాటు మత్స్యశాఖ, పశుసంవర్థకశాఖ, మార్కెటింగ్‌శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రధానంగా సమీక్ష జరపనున్నారు. ఇదే అంశంపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో కీలకశాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. తుఫాన్ నష్టాలతోపాటు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలతో అధికారులు డీఆర్సీ సమావేశానికి సర్వసన్నద్ధమై హాజరుకావాలని ఆదేశించారు. శాఖల వారీగా తుఫాన్ నష్టాల అంచనాలను వివరంగా నివేదించాల్సి ఉంటుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీటితోపాటు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా చేపడుతున్న చేర్పులు, మార్పుల అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహించే రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలోను, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రాతినిధ్యం వహించే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విలీనం చేయాలన్న ప్రజల డిమాండ్‌కు ప్రభుత్వం నుంచి సానుకూలత రావడంతో ఈ రెండు నియోజకవర్గాలు ఆ రెండు జిల్లాల్లో విలీనం అవుతాయన్న ప్రచారం నేపథ్యంలో ప్రజాప్రతినిధులు డీఆర్సీలో చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక తుఫాన్‌లో ముఖ్యంగా కొబ్బరి తోటలకు జరిగిన నష్టాలు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న తుఫాన్ సాయం పంపిణీ అంశాలపై కూడా చర్చ జరగనుంది. ఇప్పటికీ తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు తుఫాన్ సాయం పంపిణీ గందరగోళ పరిస్థితుల నడుమ కొనసాగుతూనే ఉంది. కాగా జిల్లాలో ఆక్వాసేద్యంలోని సమస్యలను ప్రస్తావించే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన తుఫాన్, భారీ వర్షాలకు ప్రధాన డ్రెయిన్లలో ముంపు పెరగడం వల్ల జరుగుతున్న పంట నష్టాల అంచనాలతోపాటు ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు ముఖ్యంగా సముద్ర మొగలు పునరుద్ధరణ, తీర ప్రాంతాల్లో ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్ వంటి అంశాలను ఈ కీలక సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించనున్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన మరికొన్ని కీలక అంశాలతోపాటు రానున్న రబీ సాగు ఏర్పాట్లు, ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల వంటి అంశాలపై డీఆర్సీలో చర్చించనున్నారని సమాచారం.



సమీక్షిస్తున్న కలెక్టర్

విదేశాల్లో ఉపాధి గైడెన్స్ కేంద్రాల సేవలను వినియోగించుకోండి

కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపు

అమలాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ప్రతీ అభ్యర్థి అధికారిక వసలదారుల గైడెన్స్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆ దేశాల్లో భద్రతతో కూడిన ఉద్యోగం పొందాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రొటెక్షన్ ఆఫ్ ఇమిగ్రేషన్ అధికార ప్రతినిధి దేవులపల్లి ఆనంద్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలనుకునే వారికి మార్గనిర్దేశం చేసేందుకే కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రాన్ని డీఆర్వో నోడల్ అధికారిగా నెలకొల్పడం జరిగిందన్నారు. ప్రొటెక్షన్ ఆఫ్ ఇమిగ్రేషన్ ప్రతినిధి దేవులపల్లి ఆనంద్ మాట్లాడుతూ ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేవారి వద్ద సరైన సమాచారం ఉండాలని, నకిలీ వీసాలు, ఏజంట్ల మోసాలకు గురికాకుండా సక్రమ పద్ధతుల్లో ఉపాధి పొందాల న్నారు. ఇబ్బందులు వస్తే సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 4250488లో సంప్రదించాలని సూచించారు. నోడల్ అధికారి కె.మాధవి, వికాస పీడీ లచ్చారావు, మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈవో సలీం బాషా.. (కింద) ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థినుల ప్రదర్శన

నైపుణ్యాభివృద్ధి సాధిస్తేనే ప్రగతి

అమలాపురంలో వృత్తి విద్య నైపుణ్యాలపై జిల్లాస్థాయి ప్రదర్శన

రాష్ట్రస్థాయి పోటీలకు 9 ప్రాజెక్టులు ఎంపిక

అమలాపురం రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సాధించడం ద్వారానే ప్రగతి ఆధారపడి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పాఠశాల స్థాయిలోనే ఒకేషనల్ విద్యా విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. జిల్లాలోని 40 పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం జిల్లాస్థాయిలో అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం చేపట్టిన ప్రదర్శనను డీఈవో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రభుత్వం తొమ్మిది కోర్సుల్లో శిక్షణ ఇస్తోందన్నారు. ఇక జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రదర్శనలో 350 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. రాష్ట్ర సమగ్రశిక్ష పథ సంచాలకుడు బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వీరికి 76 మంది ఒకేషనల్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ప్రదర్శనను జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి 9 విభాగాల్లో 9 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను సమగ్రశిక్ష జిల్లా బాలికా సంరక్షణాధికారి డాక్టర్ ఎంఏకే భీమారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అందించారు.



కాకినాడలోని ది జయలక్ష్మి కో ఆపరేటివ్ సొసైటీ భవనం

మూడున్నరేళ్లు దాటిసినా..

జయమేది!

నేటికీ తేలని జయలక్ష్మి సొసైటీ కేసు

కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డిపాజిటర్లు ఇందులో డబ్బులు పొదుపు చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బిచాణా ఎత్తేసింది. బాధితులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. కేసు విచారణలో భాగంగా కుంభకోణానికి ప్రధాన సూత్రదారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లను సీఐడీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించింది. వీరికి సంబంధించిన రూ.450 కోట్ల విలువైన 98 స్థిరాస్తులను సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాల్సి ఉన్నా ఇదేదీ జరగడం లేదు. కేసు రాజమహేంద్రవరంలోని పీడీజే న్యాయస్థానంలో కొనసాగుతుండగా పదేపదే కేసులో సీఐడీ వాయిదాలు కోరుతోంది. దీంతో వేలం ప్రక్రియ ఎప్పటికీ జరుగుతుందో అంతు పట్టడం లేదు. బాధితులకు న్యాయం చేసేందుకు సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తులను వేలం వేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేలం ప్రక్రియ ముందుకు సాగేలా సీఐడీని ప్రభుత్వం ఆదేశించింది. కానీ సీఐడీ చొరవ చూపడం లేదు.

- మూడున్నరేళ్లుగా సాగదీత
- ఎటూ తేల్చని సీఐడీ
- వాయిదాలతో కాలయాపన
- రూ.450 కోట్ల ఆస్తులు సీజ్
- వేలంపై ఎడతెగని జాప్యం
- తాజాగా అకౌంట్లలో నగదు సీజ్
- 43 కేసులు దాఖలు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

రూ.582 కోట్ల జయలక్ష్మి సొసైటీ స్కాం బాధితులకు న్యాయం కనుచూపు మేరలో కనిపించడం లేదు. సీజ్ చేసిన ఆస్తులు వేలం వేసి న్యాయం చేసేందుకు సీఐడీ ప్రయత్నించడం లేదు. పదే పదే కేసులో వాయిదాలు కోరుతూ బాధితులను ముప్పుతిప్పలు పెడుతోంది. స్కాం సమయంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్ల నగదు విడుదల చేయాల్సి ఉన్నా అదీ చేయడంలేదు. తాజాగా సొసైటీకి రుణ వసూళ్ల కింద జమయిన రూ.7.50 కోట్లు సీఐడీ ఏకంగా ఫ్రీజ్ చేసేసింది. వీటిని బాధితులు పంచుకోకుండా అకౌంట్లు స్తంభింపచేసింది. అదే సమయంలో పులిమీద పుట్రలా స్కాంకు ముందు నిందితులు జరిపిన లావాదేవీల ఆధారంగా రూ.15 కోట్లు పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ ప్రస్తుత సొసైటీకి ఇటీవల నోటీసులు జారీచేసి షాక్ ఇచ్చింది. నిందితుల ఆస్తులు వేలం వేసి డబ్బులు ఇవ్వాలని విజయవాడ కోపరేటివ్ ట్రిబ్యునల్ కేసులూ కొలిక్కిరావడం లేదు. ఇప్పట్లో న్యాయం జరిగే అవకాశాలు క్రమేపీ క్షీణించుకుపోతుండడంతో చిన్న డిపాజిటర్లు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

డిపాజిట్‌దారులు 21,895

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి చెల్లించాల్సిన మొత్తం రూ.511 కోట్లు ఉంది. రూ.లక్షలోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 నుంచి రూ.4 లక్షల లోపు 810మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5లక్షలలోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది.

ఆ డబ్బూ సీజ్...

సీజ్ చేసిన ఆస్తుల వేలానికి సీఐడీ చొరవ చూపకపోగా.. గతంలో సీజ్ చేసిన రూ.5.50 కోట్లు విడుదల చేయడానికి సీఐడీ ఆసక్తి చూపడం లేదు. తాజాగా సొసైటీకి మరోషాక్ ఇచ్చింది. కుంభకోణం తర్వాత ఏర్పడ్డ కొత్త పాలకవర్గం రుణాలు తీసుకున్న వారిని గుర్తించి రూ.7.50 కోట్లు రాబట్టింది. దీంతో చిన్న డిపాజిటర్లకు చెల్లించి న్యాయం చేస్తారని భావించారు. కానీ ఈలోపు సీఐడీ షాక్ ఇచ్చింది. కొన్ని రోజుల కిందట ఈ నగదును సీజ్ చేసేసింది. దీంతో ఇప్పుడు బాధితులు లబోదిబోమంటున్నారు. మరోపక్క కుంభకోణానికి ముందు నిందితులు రెండు పాన్ కార్డులు వినియోగించారు. ఒకటి ఇప్పటికీ నడుస్తుండగా.. మరొకటి వినియోగంలో లేదు. 2017-2018 నాటి సొసైటీ కోట్ల రూపాయల లావాదేవీల ఆధారంగా ఇప్పుడు రూ.15 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాలంటూ ఐటీ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడున్న పాలకవర్గానికి షాక్ తగిలినట్లయింది. ఒకపక్క సీఐడీ, మరోపక్క ఐటీ నుంచి ముప్పేట దాడి జరుగుతుండడంతో ప్రస్తుతం పాలకవర్గం నెత్తీనోరు బాదుకుంటోంది.

కేసులపై కేసులు దాఖలు..

నిందితులు, రుణగ్రహీతల ఆస్తులు వేలం వేసి తమకు ఆ డబ్బు ఇవ్వాలంటూ విజయవాడలోని డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ట్రిబ్యునల్‌లో బాధితుల తరఫున సొసైటీ సభ్యులు ఇప్పటివరకు 13 కేసులు దాఖలు చేశారు. తాజాగా మరో 30 కేసులు దాఖలు చేశారు. ఈ కేసులకు సంబంధించి ఆస్తుల విలువ రూ.70 కోట్లు ఉంది. వీటిపై తుది తీర్పు వస్తే కొంత వరకు నగదు తిరిగొచ్చే అవకాశం ఉంది. ఈ డబ్బొస్తే చిన్న బాధితులకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నా ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి.

'వందే మాతరం' ఇది.. మా తరం

» 150 ఏళ్ల సంబరాల్లో విద్యార్థులు

వందేమాతరం గేయం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు శుక్రవారం దేశభక్తిని చాటుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 150వ సంఖ్యలోను, వందే మాతరం ఆకారంలోను ఒదిగి దేశంపట్ల, వందేమాతరం గేయం పట్ల తమకున్న గౌరవాన్ని తెలియజేశారు. కాగా, విద్యార్థులను పలువురు అభినందించారు.


రాజోలు మండలం పొదలాడలో శాంతినికేతన్ విద్యార్థులు


ముమ్మిడివరం మండలం ఉషాకిరణ్ ఐటీఐలో..


మామిడికుదురులో వందేమాతరం ఆకారంలో ఒదిగిన దీప్తి విద్యార్థులు


అమలాపురంలోని సర్ సీవీ రామన్ పాఠశాలలో జాతీయ జెండాతో..


అన్నవరంలో సత్యదేవ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రదర్శన


ఏలేశ్వరం గురుకుల పాఠశాల ఆవరణలో 150 అంకెల ఆకారంలో ఒదిగిన బాలికలు


రాజానగరంలో వందేమాతరం అక్షర రూపంలో గాయత్రి పాఠశాల విద్యార్థులు

కాకినాడలో ఘనంగా 'వందేమాతరం' 150 ఏళ్ల సంబరాలు

» హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు రాధామోహన్ దాస్ అగర్వాల్, సానా సతీష్, ఎమ్మెల్సీ సోము, ఎమ్మెల్యే నల్లమిల్లి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు.. స్వాతంత్ర్య పోరాటంలోని సన్నివేశాల నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

కాకినాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం నినాదంతో ఆ ప్రాంతం మార్మోగింది. బ్రిటీష్ పాలకుల విభజన ఆలోచనలకు చరమగీతం పాడేలా అందరిలో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన వందేమాతరం గీతం 150ఏళ్లు పూర్తి చేసుకున్నవేళ.. 'స్వరాజ్యం-స్వదేశీ-సమైక్యత' అనే నినాదంతో కాకినాడలో సంబరాలు అంబరాన్నంటాయి. కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశిష్ట అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు రాధామోహన్‌దాస్ అగర్వాల్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పంతాడ సురేష్ హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

వందేమాతర గేయాన్ని విష్ణు దిగంబర్ పులస్కర్ ఆలపిస్తుండగా మహ్మద్ అలీ అడ్డుకున్న ఘట్టంతోపాటు స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలోని కొన్నిసన్నివేశాలను నాటికల రూపంలో ముందుగా ప్రదర్శించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ విభజనకు నాంది పలికిన కాకినాడ ప్రాంతంలోనే వందేమాతరం గీతానికి అవమానం జరిగిందని, నేడు అదే ప్రాంతంలో వందేమాతరం 150ఏళ్ల వేడుక జరుపుకోవడం చారిత్రక ఘట్టమని అన్నారు. ఎక్కడైతే వందేమాతరం గేయానికి అవమానం జరిగిందో అక్కడే 150ఏళ్ల వేడుకలు జరపడం చరిత్రేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆలోచనలను ప్రేరేపించే అనేక కార్యక్రమాలను బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టడం మంచి నిర్ణయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మతపరమైన ఆలోచనలకు నాంది పలికింది కాకినాడలో ఏఐసీసీ సమావేశమన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ కాకినాడలో పూర్తి వందేమాతరం గీతాన్ని ఎక్కడ అడ్డుకున్నారో అక్కడే 150ఏళ్ల వందేమాతర వేడుకలు నిర్వహించడం, అందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధా మోహన్ దాస్ అగర్వాల్ మాట్లాడుతూ.. వందేమాతరం గొప్పతనాన్ని వివరించారు. తొలి సారిగా తాను కాకినాడ వచ్చానన్నారు. వందేమాతరం 150ఏళ్ల ఉత్సవంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఒక దేశద్రోహి పేరు కాకినాడలో ఓ వీధికి పెట్టడం విచారకరమని, ఈవిషయాన్నిప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. వందేమాతరం గీతాలాపన సమయంలో కాంగ్రెస్‌నేత మహ్మద్ అలీ అడ్డుకున్నారన్నారు. కాకినాడలో అఖిల భారత్ కాంగ్రెస్ మహాసభలు వందేమాతారం గీతాన్ని గాయపరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి వచ్చేలా కాకినాడలో కార్యక్రమం ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అభినందించారు. వేలాది మంది విద్యార్థులతో వందేమాతరం పూర్తిగేయాన్ని పాడించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రదర్శించిన కత్తిపోటు వేషాలు




పెళపెళ.. వరుస ఊచకోత!

పక్కలో బల్లెం, పొట్ట మధ్య లోపల నుంచి బల్లెంతో పొడవడం, జబ్బపై కత్తితో నరకడం, పొట్ట లోపల నుంచి కత్తితో పొడవడం, వినాయకుడి వేషంలో నరకాసురున్ని వధించడం, రంపంతో కోయడం వంటి ఒళ్లు గగుర్పాటు కలిగించే వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చి కళాకారులు ఆకట్టుకున్నారు.

» గగుర్పాటు కలిగించేలా కత్తిపోటు వేషధారణల ప్రదర్శన

» కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాల ముగింపులో ఆకట్టుకున్న కళాకారులు

కొత్తపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటలో గౌరీదేవి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పట్టుసాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిఏటా కార్తీక పౌర్ణమి తర్వాత గౌరీదేవిని ఆలయంలో ప్రతిష్టించి విశేషపూజలతో అంగరంగ వైభవంగా ముగింపుఉత్సవాలు నిర్వహించడం మూలపేటలో ఆనవాయితీగా వస్తోంది. కత్తిపోటువేషాల ప్రదర్శన ఖర్చుతో కూడినది కావడంతో మూడేళ్లకు ఒకసారి జరుపుతుంటామని నిర్వాహకులు తెలిపారు. కొత్తపల్లి గాజులదొడ్డిలో ముగింపు ఉత్సవాలను బ్యాండ్ మేళాలతో, తీన్మార్ ప్రదర్శనలతో వైభవంగా నిర్వహించారు.

రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మనవాళ్లు

అనంతపురంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.






అనంతపురంలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీల్లో భాగంగా ప్రారంభ కవాతు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఉద్యోగులు


కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్ రోడ్డును పరిశీలిస్తున్న బాషా

తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్ బాషా

కొత్తపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి విషయాల్లో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ షేక్ ఖలీఫతుల్లా బాషా పేర్కొన్నారు. మొంథా తుఫాన్‌కు కోతకు గురైన కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సుబ్బంపేట రచ్చబండ వద్ద మత్స్యకారులతో తుఫాన్ సహాయక చర్యలు, స్థానిక పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వంటి అంశాలపై చర్చించారు. పర్యటనలో ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ, ఆర్టీఐ ఆంధ్రప్రదేశ్ జేఏసీ అధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్, ముస్లిం థింకర్స్ ఫోరం సహ కన్వీనర్ హసన్ షరీఫ్ పాల్గొన్నారు.


ఉప్పాడ బీచ్ రోడ్డులో సిమెంటు కాంక్రీటు పనులను పరిశీలిస్తున్న క్రాంతి

శరవేగంగా బీచ్ రోడ్డు మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీరు క్రాంతి

కొత్తపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో కెరటాల ధాటికి ఛిద్రమైన ఉప్పాడ బీచ్ రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ క్రాంతి తెలిపారు. బీచ్ రోడ్డులో పెద్ద వంతెన సమీపంలో కెరటాల ఉధృతికి రోడ్డు విరిగినచోట సిమెంటుతో చేపట్టిన కాంక్రీటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఎస్ఈ వెంట ఇన్‌చార్జి ఈఈ నర్సయ్య, జేఈఈ లోవరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుజ్జి వున్నారు.


దాత రవికుమార్ దంపతులకు స్వామి, అమ్మవార్ల ఫొటో అందజేస్తున్న ఈవో జగన్మోహనశ్రీనివాస్

పాదగయలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పిఠాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకం ట్రస్టుకు గొల్లప్రోలుకు చెందిన దంగేటి రవికుమార్-సాయిరత్నం దంపతులు రూ.1,01,116 విరాళాన్ని శుక్రవారం ఈవో కాట్నం జగన్మోహనశ్రీని వాస్‌కు అందజేశారు. దంగేటి అప్పన్న, అచ్యుత పేరున ప్రతిఏటా కార్తీక పౌర్ణమి రోజున అన్నదానం జరపాలని కోరారు. దాత కుటుంబ సభ్యులను ఈవో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. సూపరింటెండెంట్ వీరభద్రరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.



65 కిలోల ఇత్తడి రుద్రాక్ష మండపం బహూకరణ

ఆత్రేయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో వేంచేసియున్న ఉమాకమండలేశ్వరస్వామికి ర్యాలి సుబ్బారావు జ్ఞాపకార్థం లక్ష్మీమాణిక్యాంబ కుమారులు, కుమార్తెలు 65 కిలోల ఇత్తడితో రుద్రాక్ష మండపం చేయించారు. శుక్రవారం దానిని ఆలయానికి బహూకరించగా సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంలను ఈవో బీహెచ్‌వీ రమణ మూర్తి అందజేశారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రాజశేఖరం (పక్కన) స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడలతో మరింత ఆత్మవిశ్వాసం

69వ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్క్వాష్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్క్వాష్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రకాశనం అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సతీష్‌కుమార్ అధ్యక్షత వహించారు. అండర్-14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్క్వాష్ అనేది కేవలం క్రీడ మాత్రమే కాదని.... శరీరం మనసును సమానంగా శక్తివంతం చేసే ఆరోగ్యకరమైన కసరత్తు అన్నారు. ఈ వేగవంతమైన ఇండోర్ గేమ్ గుండె ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని, శక్తి సమన్వయాన్ని పెంపొందిస్తుందన్నారు. వేగవంతమైన స్పందన సామర్థ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. యువతలో దృష్టికి పదునుపెట్టి, ఒత్తిడిని తగ్గిస్తూ వ్యూహాత్మక ఆలోచనలను అభివృద్ధి చేసే ప్రత్యేకత కూడా ఈ ఆటలో ఉందన్నారు. కొత్త స్నేహాలు, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి స్క్వాష్ ప్రధాన విలువలను వివరించారు. రాష్ట్రవ్యాపంగా పలు జట్లు పాల్గొంటున్న ఈ చాంపియన్‌షిప్ శనివారం ముగుస్తుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి తెలిపారు.

కార్యక్రమంలో డీఈవో పిల్లి రమేష్, రాష్ట్ర వ్యాయామ విద్య పర్యవేక్షణ అధికారి మహబూబ్ బాషా, అబ్జర్వర్ ఎస్.బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, కాకినాడ జిల్లా పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీలు లంకా జార్జ్, రవిరాజ్, జి.సునీల్‌కుమార్, కె.మంగమ్మ, జీజేఆర్ఎస్ కౌర్, సూరిబాబు, నాగమణి, దీప్తి ఎస్తేర్, డీఎస్ఏ కోచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అక్కాచెల్లెళ్లు రెజ్లింగ్‌లో మెరిశారు

రాష్ట్ర స్థాయి పోటీల్లో వేట్లపాలెం విద్యార్థులకు బంగారు పతకాలు



బంగారు పతకాలతో సుధీష్ణ (పైన). హారికశ్రీ (కింద)

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన అక్కాచెల్లెళ్లు సత్తా చాటారు. కేజీ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దాసరి సుధీష్ణ అండర్-14 విభాగంలో, పదో తరగతి చదువుతున్న దాసరి హారికశ్రీ అండర్-17 విభాగంలో బంగారు పతాకాలు సాధించారు. డిసెంబరు 8 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏపీ తరఫున వీరు పాల్గొంటారని పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులకు, వారి విజయానికి తోడ్పాటు అందించిన తల్లిదండ్రులకు, పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు. సుధీష్ణ, హారికశ్రీ ప్రతిభ కనబర్చడంలో విశేష కృషి చేసిన వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు, పీఈటీ ఎండీ ఇబ్రహీంలను కూడా అభినందించారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.73 కోట్లు



హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,73,37,811 నగదు, 37 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటుగా ఫ్రాన్స్ కరెన్సీ 200, యూఎస్ఏ 41 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పౌండ్స్, స్కాట్లాండ్ 20 డాలర్లు లభించాయి. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లెక్కించగా సరాసరిన రోజుకు రూ.5.77 లక్షలు భక్తులు హుండీలలో సమర్పించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శుక్రవారం ఇద్దరు దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. జగ్గంపేటకు చెందిన కంచర్ల శ్రీనివాసరావు రూ.లక్ష, విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన గోలి గురునాధరావు రూ.1,01116 ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

శివసదన్ క్యాటేజీకి రూ.10 లక్షల విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత సుబ్బారావు

అన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీలో ఒక గదికి డోనర్‌స్కీమ్ ద్వారా కాకినాడకు చెందిన ములకల సుబ్బారావు, కనకదుర్గ దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని శుక్రవారం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.

బండి.. జాగ్రత్తండి!

తరచూ రోడ్డు ప్రమాదాలు చూస్తూనే ఉంటాం... అయినా కొందరిలో మార్పు రావడంలేదు. ఆటోలో అంచున కూర్చుని ప్రయాణం చేస్తున్నవారు కొందరైతే.. హైవేపై అజ్రాత్తగా వాహనాలు నడుపుతున్నారు మరికొందరు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం..





కాకినాడ జిల్లా అన్నవరం - కత్తిపూడి రహదారిపై ఆటోలో అంచున కూర్చున్న మహిళలు ఇలా...

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, కాకినాడ/ రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)





రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై ఒకే వాహనంపై ముగ్గురు ఇలా..



హైవేపై యువకులు జారిపడేలా..

చోరీ కేసుల్లో నిందితులకు ఆరు నెలల జైలు

రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనం కేసుల్లో ముగ్గురు నేరస్తులకు 6 నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ 5వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ జి.శ్రీనివాస రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2024 నవంబరు 11న క్వారీ సెంటర్ సమీపంలోని డీమార్ట్‌కు వెళ్లి బయటకు వచ్చేసరికి తన ద్విచక్రవాహనం లేదని సీహెచ్. రామకృష్ణ, నవంబరు 8న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద తన ద్విచక్ర వాహనం దొంగిలించారని గోలి రామ్‌ప్రసాద్, వీవర్స్ కాలనీలో తన ఇంటి వద్ద పార్క్ చేసిన వాహనం కనిపించలేదని అదేనెల 14న గోకాడ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు రాజమహేంద్ర వరం శానిటోరియం ప్రాంతానికి చెందిన పిల్లి దేవేంద్ర(పిల్లి), ఆంగ్ర రమణ(కేసీఆర్), చప్పిడి సాయి కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం మొదటి 2 కేసుల్లో నిందితులైన దేవేంద్ర, రమణ, సాయి కుమార్, తర్వాతి 2కేసుల్లో నిందితులైన దేవేంద్ర, రమణకు కోర్టు జైలు శిక్ష విధించిందని తెలిపారు.

కారులో గంజాయి రవాణా

ముగ్గురి అరెస్ట్

21.7 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గండేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 21.7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామ శివారు ఎన్టీ రాజపురం రోడ్డులో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా మారుతి షిఫ్ట్ కారులో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. కారులో ఉన్న తాకు నరసింహ సింగ్, పున్నాన తేజ, మహీందర్ సింగ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి 11 ప్యాకెట్లలో ఉన్న రూ.1,08,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 3 స్మార్ట్‌ఫోన్లు, రూ.2 వేలు నగదు, షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.3,73,500 ఉంటుందని సీఐ తెలిపారు. గంజాయి సేకరణలో 13 మంది వ్యక్తులు ప్రమేయం ఉన్నట్టు ప్రాథమికంగా సమాచారం ఉందని, దర్యాప్తు చేసి 13 మందిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచుగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ, గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు, కిర్లంపూడి ఎం.రాజు, ఎ.వీర బాబు,కృష్ణారావును జిల్లా ఎస్పీ అభినందించారు.

7 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న 7 టన్నుల రేషన్ బియ్యాన్ని, 2 వ్యాన్లను విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ సీఐ మధుబాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై 6ఏ, 7వన్ కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని గోపాలపురం స్టాక్ పాయింట్‌కు చేర్చి వ్యాన్లను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

ప్రమాదం అంచుకు..

శంఖవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బెంగుళూరు నుంచి విశాఖపట్నం ప్లేవుడ్ లోడుతో వెళ్తున్న లారీ కత్తిపూడి సమీపంలో అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొంది. లారీ పూర్తిగా డివైడర్ గోడపై నిలిచిపోవడంతో కాలువలో పడే ప్రమాదం నుంచి తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.



శంఖవరం జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్ ఎక్కిన లారీ

అనుమానం పెనుభూతమై...

కత్తితో భార్య పీక కోసిన భర్త

అనంతరం పురుగులమందు తాగి పీక కోసుకుని ఆత్మహత్య

కాకినాడ జిల్లా తూరంగిలో ఘటన



రాజేష్ మృతదేహం



కాకినాడలో చికిత్స పొందుతున్న దేవి

కాకినాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కత్తితో పీక కోసి అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగిలో జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చీపురుపల్లి దేవి (34), చీపురుపల్లి రాజేష్(36) దంపతులు. 13ఏళ్ల కుమార్తె, 8ఏళ్ల కొడుకుతో కలిసి కర్ణాటకలోని సింధునూరులో నాలుగేళ్లుగా నివసిస్తున్నారు. ఇటీవల దీపావళి పండుగకు కాకినాడ జిల్లా తూరంగిలోని అత్తారింటికి వచ్చారు. భర్త తన సొంతూరు కాజులూరు మండలం శీల వెళ్లాడు. ఈనెల 4న దేవి అక్క కొడుకు, చెల్లితో కలిసి కాకినాడ కుళాయిచెరువు పార్కుకు వెళ్లారు. అక్కడ దేవి తనకు బావ వరసున్న వ్యక్తితో మాట్లాడుతుండగా ఆమె మరిది చూసి తన అన్న రాజేష్‌తో చెప్పాడు. దీంతో శుక్రవారం శీల నుంచి తూరంగి ఏఎస్ఆర్ కాలనీలోని అత్తారింటికి బియ్యంమూటను తీసుకొచ్చిన రాజేష్ భార్యను ఆ విషయంపై నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో తన వద్ద ఉన్న కత్తితో పీకపై కోశాడు. అనంతరం రాజేష్ రాత్రి 7గంటల సమయంలో తాళ్లరేవు మండలం పటవల పొలాల్లోకి వెళ్లి పురుగులమందు తాగి అనంతరం తన వద్ద ఉన్న కత్తితో పీక కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కోరంగి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. దేవికి పీక వద్ద నుంచి భుజంవరకూ తీవ్రమైన గాయం కావడంతో ఆమె తల్లి వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. ప్రస్తుతం చికిత్స పొందుతుందని, ఆమె స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు పేర్కొన్నారు. దేవి తండ్రి కుడుపూడి వీరవెంకటసత్యనారాయణ కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగి. ఆయనకు ముగ్గురు కుమార్తెలుండగా దేవి మూడో సంతానం.

రంజిత మృతిపై 5 బృందాలతో దర్యాప్తు

రామచంద్రపురంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కోనసీమ జిల్లా ఎస్పీ

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మృతిచెందిన మైనరు బాలిక రంజిత మృతిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం రామచంద్రపురం త్యాగరాజ నగర్‌లో రంజిత మృతి చెందిన గదిని, పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కేసు దర్యాప్తు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నామన్నారు. డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో 5 బృందాలతో దర్యాప్తు జరుగుతుందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిగిందని, ఫోరెన్సిక్ పరిశీలనకు నమూనాలు పంపడం జరిగిందన్నారు. సాంకేతిక ఆధారాల కోసం ఎదురుచూస్తున్నామని వాటితో పాటు వివిధ కోణాల్లో లభించిన ఆధారాలను విశ్లేషణ జరిపి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. బాలిక తల్లితండ్రులు వ్యక్తంచేసిన అనుమానాలు కూడా పరిగణలోకి తీసుకుని దర్యాప్తు జరుగుతుందన్నారు. అంతకుముందు సంఘటనా స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. రంజిత మృతి చెందిన గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. సమీపంలో ఉన్న ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో ఘటకు సంబంధించిన విషయాలపై ఆరా తీశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా

చిట్టీల వ్యాపారి ఆత్మహత్య



బాల్య (ఫైల్)

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్టీల వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటపాకకు చెందిన భూక్యా బాల్య (60) కొంతకాలంగా తెలంగాణలోని భద్రాచలంలో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ముందుగా చిట్టీలు పాడుకుని నగదు తీసుకున్న సభ్యులు తిరిగి నగదు చెల్లించకపోవడం, మిగతా సభ్యులు కూడా బాల్యపై ఒత్తిడి తెచ్చారు. సుమారు రూ.5కోట్ల వరకు చిట్టీల నగదు వసూలు అవ్వక అప్పులతో నష్టపోయాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. చికిత్స పొందుతూ బాల్య మృతిచెందాడు. అతడి కుమారుడు కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన యువకుడు



మోటార్‌సైకిల్

నిడదవోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోజువారీ కోత మిషన్‌పై పనిచేసే ముగ్గురు యువకులు తెల్లవారుజామున టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చి బ్రిడ్జి డివైడర్‌ను ఢీ కొనడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సమిశ్రగూడెం బ్రిడ్జిపై శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరం మార్కొండపాడుకు చెందిన యువకులు మోటారుసైకిల్‌పై విజ్జేశ్వరం వెళ్లి తిరిగివస్తుండగా సమిశ్రగూడెం ఓవర్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ సంఘటనలో చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన నామన కోట సత్యనారాయణ (సత్తిపండు) (28) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మల్లవరానికి చెందిన నాగిరెడ్డి మంగేష్కర్, అరిగెల సాయిదుర్గ గాయాలపాలయ్యారు. గాయపడిన నాగిరెడ్డి మంగేష్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం ఏఎస్ఐ చిన్నయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మంగేష్కర్, సాయిదుర్గను మెరుగైన వైద్యసేవల నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో మృతుడు, గాయపడిన ఇద్దరు యువకులు అవివాహితులే.

అనాథ శవానికి అంత్యక్రియలు

అంబాజీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాకలగరువు పుష్కరఘాట్ వద్ద సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఈనెల 4న లభ్యమైన విషయం తెలిసిందే. ఈ మృతదేహాన్ని గుర్తించి ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని 72 గంటల పాటు మార్చురీలో ఉంచి అన్ని పోలీస్‌స్టేషన్లకు, సోషల్‌మీడియాలో సమాచారాన్ని అందించారు. అయితే బంధువులు, కుటుంబ సభ్యులు ఎవ్వరూ రాకపోవడంతో పోలీసులు అంబాజీపేట నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల వెంకటసుబ్బారావుకు సమాచారం అందించారు. దీంతో పోలీసుల సమక్షంలో అమలాపురం మున్సిపల్ కైలాస భూమిలో శుక్రవారం సాయంత్రం అనాథ శవానికి అంత్యక్రియలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగాబత్తుల సుబ్బారావు ట్రస్టు తరుఫున గతంలో పది మందికి పైగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావును పలువురు అభినందించారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కాలువలో వ్యక్తి మృతి

గండేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు సమీపంలో ఉన్న పోలవరం కాలువలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన యడాల దుర్గాప్రసాద్ (21) ఈనెల 5న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం తాళ్లూరు సమీపంలో పోలవరం కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారం రావడంతో వెళ్లిచూడగా దుర్గాప్రసాద్ మృతదేహంగా గుర్తించారు. దుర్గాప్రసాద్ కాలువలో కాలు జారి పడిపోయి ఉండొచ్చని వారు ఫిర్యాదు ఇవ్వడంతో గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

‘ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్’



అమలాపురంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

అమలాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్‌పై రివ్యూ పిటీషన్ వేసేవిధంగా చొరవ చూపాలని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. విద్యారంగ సమస్యలపై శుక్రవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, అల్లవరం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వీసు రూల్స్ పరిష్కరించి పదోన్నతులు కల్పించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలతో పాటు ఇతర బకాయిలను చెల్లించాలన్నారు. తక్షణం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం ఐర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2027లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫ్యాప్టో పక్షాన శాసన మండలిలలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని వినిపించే వారిని ఎన్నుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, మండలశాఖల ప్రతినిధులు నంద్యాల గురునాయుడు, రత్నంరాజు, తోట బాలకృష్ణ, యాళ్ల జ్యోతికుమార్, ప్రభాకర్, కోలా వెంకటశ్రీనివాస్, రాజేష్, చిన్నం రాంబాబు, శ్యామలరావు, దివాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో రోధిస్తున్న కుటుంబసభ్యురాలు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన మలిరెడ్డి భూచక్రం (60) శుక్రవారం రాత్రి సామర్లకోట ఆసుపత్రిలో మృతిచెందాడు. ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల కిందిస్థాయి సిబ్బంది అరకొర వైద్యం చేయడంతో భూచక్రం మరణించాడని అతడి బంధువులు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రాత్రి ఆందోళనకు దిగారు. స్థానిక వేణుగోపాల స్వామి గుడి ప్రాంతానికి చెందిన మలిరెడ్డి భూచక్రం గుండెల్లో నొప్పి వస్తుందని శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రికి రాగా డాక్టర్ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది డ్యూటీ డాక్టర్ ఫోన్‌లో చెప్పిన సమాచారంతో ఒక ఇంజెక్షన్ చేయగా నొప్పి మరింత పెరిగింది. దీంతో మరో ఇంజెక్షన్ చేసే ప్రయత్నంలో భూచక్రం మృతిచెందినట్టు సమాచారం. దీంతో మృతుడి బంధువులు డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏలేరులో తగ్గుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తుఫాను తర్వాత తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుంచి 1375 క్యూసెక్కుల నీరు వచ్చింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్లస్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 85.58 మీటర్ల స్థాయిలో 22.12 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతానికి 1200 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో అవినీతికి పాల్పడిన అధికారులపై కొరడా ఝుళిపిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఆదేశాలు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు, కాతేరు, హుకుంపేట, పిడింగొయ్యి గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగం, అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలకు సంబంధించి 2020-2024లో లోకాయుక్తకు రెండు ఫిర్యాదులు వచ్చాయి. మచిలీపట్నానికి చెందిన జె.శ్రీనివాసగౌడు దాఖలు చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రామాలకు చెందిన అధికారులు కేపీ చంద్రశేఖర్, పి.సురేష్‌బాబు, బి.రామశ్రీనివాస్, డి.విజయరాజుతో పాటు మరి కొందరిపై ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత లోకా యుక్త పదవీ ఖాళీగా ఉండడంతో ఉప లోకా యుక్త రజని కేసును విచారించారు. సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది. ఇతర అధికారులైన రామ ప్రసాద్‌రావు, బెన్హర్ ఎడ్వర్డ్, రామ్మోహన్‌రావు, మహేశ్వరప్రతాప్, శ్రీనివాసరావు, సుభాషిణిపై కూడా చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది.



మలికిపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


యానాంలో వందేమాతరం గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

వందేమాతర గీతాన్ని మననం చేసుకోవాలి

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- ఘనంగా 150 సంవత్సరాల వందేమాతరం గీతం వేడుకలు

మలికిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని బకింగ్‌చంద్ర్ చటోపాధ్యాయ 1870లో రాశారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆయన బెంగాలీ నవల ఆనంద మఠంలో ఈ పాటను చేర్చారని, దీనిని రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచారన్నారు. శుక్రవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో జరిగిన 150 సంవత్సరాల వందేమాతరం గీతం వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి వందేమాతరం స్ఫూర్తిని ఇనుమడింప చేసుకుని దేశంపట్ల భక్తిని కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంప వేమా, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ, ఆర్.పద్మరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తిని చాటుతూ...

అమలాపురంటౌన్(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం దేశభక్తిని చాటుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం సర్‌సీవీ రామన్ స్కూలులో 150 అడుగుల జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ బి.కేశవరావు, హెచ్‌ఎం జి.రాజా, సహస్ర ఇంటర్నేషనల్ ప్రిన్సిపాల్ జార్జిపీటర్, కరస్పాండెంట్ ఆర్.సత్యకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గొల్లగూడెం ఆదిత్య పాఠశాలలో విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించి 150 ఏళ్ల సంఖ్య ఆకారంలో ప్రదర్శనగా నిలిచారు. అలాగే అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు శుక్రవారం 150 వందేమాతరం ఆకారంలో ఒదిగి సహచర విద్యార్థులతో కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు.

అంబాజీపేటలో ర్యాలీ

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో వందేమాతారాన్ని ఆలపించారు. స్థానిక స్టేషన్‌లో భారతమాత చిత్రపటానికి పూలమాల లువేసి ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో బి.మమత, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఏపీవో అడపా వెంకటకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరులో కూటమి ఆధ్వర్యంలో వందేమాతర గీతం 150 ఏళ్ల కార్యక్రమం నిర్వహించి జాతీయ గీతాన్ని ఆ లపించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు, ఏపీవో రాజామణి, సిబ్బంది, బీజేపీ మండలాధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, టీడీపీ నాయకులు అల్లు సత్తిబాబు, వాసర్ల అప్పారావు, జనసేననాయకుడు సురేష్‌బిందాస్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ముమ్మిడివారం డాక్టర్ రావుబహదూర్‌రఘుపతి వెంకటరత్నంనాయుడు డిగ్రీ, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ మహిళా కళాశాలలో శుక్రవారం వందేమాతర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ జి.శ్రీరామమూర్తి, జగతా సురేష్, గణేషుల సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఉషాకిరణ్ ఐటీఐలో 150 అంకె రూపంలో ఒదిగి విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. తారా జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

వందేమాతరం ఆకారంలో విద్యార్థులు

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి విద్యార్థులు వందేమాతరం ఆకారంలో 150 సంఖ్యారూపంలో ఏర్పడి ఆకట్టుకున్నారు. స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బకింగ్‌చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో వందేమాతరం గేయం 150సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలపరిషత్ అధ్యక్షురాలు మేడిచర్ల వెంకటసత్యవాణిరాము ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది వందేమాతర గీతాన్ని అలపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, పరిపాలనాధికారి మిల్టన్, ఏపీవో లక్ష్మి, ఏపీఎం సయ్యద్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి):గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం 150వ వందేమాతరం గీతోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు, యువత, క్రీడాకారులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. హెచ్‌ఎం కనకదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పీఎంసీ ఛైర్మన్ వోలా సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ యాళ్ళ సత్యశ్రీ, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, డి.సరస్వతి, విజయభాస్కర్, స్థానిక నాయకులు గాలిదేవర సురేష్, మద్దింశెట్టి సీతారామస్వామి, అరిగెల నరేష్, మధుర ప్రతాప్ పాల్గొన్నారు.

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సామూహిక వందేమాతర గానం నిర్వహించారు. ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన మండలాభివృద్ధి అధికారి పీఆర్సీ రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు, పరిపాలనాధికారి, సీనియర్, జూనియర్ సహాయకులు, మెడికల్, మండలపరిషత్ కార్యాలయం సిబ్బంది వందేమాతర గీతాలాపానచేసి దేశభక్తిని చాటుకున్నారు. కేశవదాసుపాలెం హైస్కూలులో మండల విద్యాశాఖాధికారి డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం సంబరాలు నిర్వహించారు.

150వ సంఖ్య ఆకారంలో విద్యార్థులు

రాజోలు(ఆంధ్రజ్యోతి): పొదలాడలో శుక్రవారం శాంతినికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులంతా 150 సంఖ్యలో ఒదిగి వందేమాతరం విశిష్టతను శుక్రవారం చాటిచెప్పారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ బేతంసీడి నాగరాజు, ప్రిన్సిపాల్ కేవీవీ సత్యనారాయణ, స్కూలు ఇన్‌చార్జి ఎల్.హరిరామరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాటిపాకలో బిక్కిన తిరపన్న, శ్రీమతి వెంకటరమణమ్మ మెమోరియల్ ట్రస్టు స్కూలులో వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య పాల్గొని విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. విద్యార్థులచే వందేమాతర ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజోలు ఎంఈవో ఎస్.మనోహరం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆరుమిల్లి రోహిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యానాం(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు సందర్భంగా యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్‌మీడియం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఎస్పీ వరదరాజన్, విద్యాశాఖాదికారి పంపన లక్ష్మణప్రవీణ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధికారులు అందరూ ముక్త కంఠంతో వందేమాతరం గీతం అలపించారు. స్థానిక జవహార నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ శ్రీపాదచంద్ర కీర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది తిరంగా జెండాలను చేతబూని వందేమాతర గీతాన్ని అలంపించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజాదర్బార్

- 154 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బారు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఎమ్మెల్యే 154 అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రెయిన్లు, పెన్షన్లు, విద్యుత్ సమస్యలపై అర్జీలను స్వీకరించినట్టు ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ముంగండ విద్యార్థినుల ప్రతిభ


వ్యాసరచన పోటీలలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థినులు

పి.గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా ఆధ్వర్యంలో వారధి ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో ముంగండ హైస్కూల్ విద్యార్థినీలు తృతీయస్థానం సాధించారు. మండలస్థాయిలో గత నెలలో నిర్వహించిన పోటీలలో హైస్కూల్‌కు చెందిన కాసుసూర్యఅక్షయ, బొంతు నాగహాసిని, పులపర్తి సౌమ్యశ్రీలు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో అక్టోబరు 18న నిర్వహించిన పోటీలలో మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం 22న రెండు తెలుగు రాష్ట్రాలస్థాయిలో 280 మంది విద్యార్థులు పాల్గొనగా డవలప్‌మెంట్ రిపోర్ట్ అంశంలో ముంగండ విద్యార్థులు ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించారు. ఈసం దర్భంగా వారిని డీఈవో సలీంబాషా, పాఠశా ల ప్రధానోపాధ్యాయిని దామిశెట్టి గీతాకళ్యాణి, ఏంఈవోలు కె.హెలీనా, వీరభద్రానందం అభినందించారు.

రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటేషన్ పోటీలకు మామిడికుదురు విద్యార్థులు

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కిల్ కాంపిటేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్టు మామిడికుదురు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ఫుడ్ ప్రోసెసింగ్, రిటైల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో అమలాపురంలో సర్వశిక్షాబియాన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో తమ స్కూలు నుంచి ఫుడ్ ప్రోసెసింగ్ విభాగంలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, రిటైల్ విభాగం నుంచి తృతీయ స్థానం పొందినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు వృత్తి విద్యా ఉపాధ్యాయులు మౌనికా కృష్ణ, మధు, సత్యశ్రీలు అభినందించారు.

నేషనల్ పోటీలకు యశస్విని


యశస్వినిని అభినందిస్తున్న పెద్దలు, వాలీబాల్ క్రీడాకారులు

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థిని, ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన గాలిదేవర యశస్విని అండర్-19 బాలికల విభాగంలో వాలీబాల్ జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటున్నట్టు హెచ్‌ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో యశస్విని అభినందన సభ నిర్వహించారు. యశస్విని తల్లిదండ్రులు సురేష్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ వోలా సత్యనారాయణ, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, చీకట్ల కిశోర్, కూటమి నాయకులు చిక్కం ఉమేష్, మద్దింశెట్టి సీతారామస్వామి, అరిగెల నరేష్, నాగులపల్లి రాజు, చిక్కం వెంకటకృష్ణ, ఆకుల సూర్యనారాయణమూర్తి, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయిలో ద్వితీయస్థానం సాధించిన పి.గన్నవరం విద్యార్థులు


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్ఎస్‌ఏ నైపుణ్యా పోటీలలో పి.గన్నవరం హైస్కూల్లో 9,10తరగతులు చదువుతున్న విద్యార్థులు రిటైల్‌రంగంలో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించారు. ఈసందర్భంగా అమలాపురం బాలుర హైస్కూల్లో జరిగిన పోటీలలో పాల్గొని అనంతరం జరిగిన అభినందన సభలో ముఖ్యఅతిథుల నుంచి జ్ఞాపికను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. విద్యార్థినీలు సుప్రజ, పూర్ణిమ, ప్రసన్న, సాయిసంజన, రిషిత, సత్య, నీలిమలను డీఈవో షేక్ సలీం భాషా, ఏపీసీ మమ్మి, జీసీడీవో ఎంఏకె భీమారావు, ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రమేష్, ప్రధానోపాధ్యాయిని కోసూరి ఉమాదేవిలు అభినందించారు. అలాగే విద్యార్థులు శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్‌ను హెచ్‌ఎం అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐదుగురు క్రీడాకారుల ఎంపిక

అమలాపురంరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎన్.విజకుమారి తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో ఎన్‌పీఎస్‌ఎన్ ప్రశాంత్, టి.డేవిడ్, నవదీపక్, ఎం.ఉమాశివప్రసాద్, డి.లోకేశ్, సత్యవినాయక్, ఐ.మౌనికాంజలి ఎంపిక కాగా వారిని శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా అభినందించారు.


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

'తుఫాన్ సహాయం సద్వినియోగం చేసుకోండి'


తుఫాన్ బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మలికిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మలికిపురంలో చేనేత కార్మికులకు మంజూరైన బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో 10,500 మంది తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆదుకున్నామన్నారు. ఆదుకోవడం జరిగిందన్నారు. 7617 మత్స్యకార కుటుంబాలకు, 1663 చేనేత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించామన్నారు. ప్రభుత్వ పునరావాసం పొందిన 1895 బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు అదనంగా రూ.3వేలు చొప్పున తుఫాన్ ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఏఎంసీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, సొసైటీ అధ్యక్షుడు జంపన సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మలికిపురంలో బీజేపీ నాయకులు, చింతలమోరి సొసైటీ అధ్యక్షుడు దొడ్డా నాగబాబునూతనంగా ఏర్పాటుచేసిన ఇంటీరియర్స్ షాపును ప్రారంభించారు. అదేవిధంగా మలికిపురంలో హ్యుండాయ్ షోరూంలో నూతన మోడల్ వెన్యూ కారును ప్రారంభించారు.

తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే సాయం పంపిణీ

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకార, చేనేత కుటుంబాలకు శుక్రవారం సాయం పంపిణీ చేశారు. తొత్తరమూడి గ్రామంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాధితులకు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బాధితులకు తుఫాన్ సమయంలో అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందించిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడువారిపాలెం సచివాలయ పరిధిలో తుఫాన్ బాధితులకు శుక్రవారం నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.సుభాష్, వీఆర్వో మోహనరావు, రేషన్‌షాపు డీలర్ మాదాల త్రిమూర్తులు, కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగాకుమారి, శ్రీనివాసరాజు, బుజ్జి, పాల్గొన్నారు.

యానాం పర్యాటక ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- మంత్రి షేకావత్‌తో ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యానాంకు పర్యాటక పాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మల్లాడి కేంద్ర మంత్రులను, ప్రభుత్వ ఆధికారులను కలిసి వినతులను అందజేశారు. ఈసందర్భంగా మల్లాడి యానాం పర్యాటక ప్రాజెక్టులపై చర్చించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నారని మల్లాడి తెలిపారు.

తుఫాన్ సేవలపై ఎస్ఐ, వీఆర్వోలకు సన్మానం


ఎస్ఐ సంపత్‌కుమార్, వీఆర్వో చిట్టిబాబులను సన్మానించిన దృశ్యం

అల్లవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించిన బోడసకుర్రు వీఆర్వో యు.చిట్టిబాబు, అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్‌లను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తుఫాన్ పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించడంతో వారి సేవలను కొనియాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముత్యాల బాబి, ఓలేటి పరమేశ్వరరావు, రోళ్ల శ్రీనివాస్, చింతం శ్రీను, అరవ చంటి, అయిల నాగేశ్వరరావు, బొంతు పల్లంరాజు, మొయిల గణపతిరావు, పంచాయతీ కార్యదర్శి బి.ఆదిశంకరం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

అమలాపురంరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌వ్యాధిపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ పెనుమాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై చేపట్టిన అవగాహన ర్యాలీని సర్పంచ్ ప్రారంభించారు. చింతా శంకరమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గౌతమీ, డాక్టర్ అమృత, అన్నామణి పాల్గొని క్యాన్సర్ వ్యాధి లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేశారు. అలాగే మొంథా తుఫాన్ కారణంగా మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సాయాన్ని శుక్రవారం బండారులంక, ఇందుపల్లి గ్రామాల్లో చేపట్టారు. ప్రతీ మత్స్యకార కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు విధిగా క్యాన్సర్ నిర్థారణ పరీక్షలు చేయించుకోవాలని లూటకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సత్యవతి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని లూటకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని పాశర్లపూడిలంక, లూటకుర్రుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి):క్యాన్సర్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, వి.గౌతమిలు అన్నారు. అంబాజీపేటలో పీహెచ్‌సీ వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన క్యాన్సర్ జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అప్పారావు, ఎస్ఎంసీ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమరణ దీక్ష విరమణ

ముమ్మిడివరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండును పునరుద్ధరించాలని, ఆక్రమణలు తొలగించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన ఆమరణ నిరహారా దీక్షను ఆర్టీసీ ఉన్నతాధికారుల హామీ మేరకు శుక్రవారం దీక్షను విరమించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దారా సురేష్ నిమ్మరసం ఇచ్చి శుక్రవారం దీక్షను విరమింప చేశారు.

విచారణ వాయిదాపై భగ్గుమన్న గ్రామస్థులు

- తక్షణ విచారణ డిమాండ్ చేస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం

ఉప్పలగుప్తం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం జరగాల్సిన త్రిసభ్య కమిటీ విచారణ వాయిదా పడటంపై గ్రామస్థులు భగ్గుమన్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంవద్ద ఆందోళన చేశారు. అనంతరం తక్షణ దర్యాప్తును డిమాండ్ చేస్తూ ఎంపీడీవో డి.కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీలో సర్పంచ్ లక్షల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఆధారాలతో సహా గతంలో ఎంపీటీసీ తాళ్ళ లక్ష్మీనరసాయమ్మ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ప్రధానంగా రూరల్ వాటర్ వర్క్స్ పథకంలో లక్షల్లో సొమ్ము స్వాహా జరిగిందంటూ గ్రామస్తులు అధికారులకు రాతపూర్వకంగా వివరించారు. దీనిపై విచారణకు డీపీవో త్రిసభ్య కమిటీని నియమిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ నెల 7న విచారణ జరుపుతామని ఫిర్యాదు దారులకు సమాచారం ఇచ్చారు. విచారణకు రావడం లేదని కబురు పెట్టడంతో గ్రామస్థులు మండిపడ్డారు. పంచాయతీలో ప్రజాధనం స్వాహా జరిగిందని ఆధారాలతో వివరిస్తే విచారణకు అధికారులు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారంటూ రోడ్డెక్కారు. వెంటనే విచారణ జరపకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో చిక్కం భీముడు, తాళ్ళ రవి, పులిదిండి మధు, మోటూరి రవి, చిక్కం వెంకటకృష్ణ, జనిపెల్ల సునీల్, నాగులపల్లి రాజు, మోటూరి బసవయ్యనాయుడు, బిక్కిన ఏసు, సలాది తాతారావు, సలాది కన్నా, నాగులపల్లి పరశురామ్, శివభాస్కర్ పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయాధికార సంస్థ, జిల్లా న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ తెలిపారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు, చెక్‌బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు ఈనెల 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో పాల్గొని కేసులు పరిష్కరించుకోవాలని కోరారు. నేషనల్ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు, బ్యాంకు, రెవెన్యూ అధికారులు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సహకరించాలని ఛైర్మన్ గోవర్ధన్ కోరారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

ముమ్మిడివరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అన్యాయం జరిగినప్పుడు ఎటువంటి భయాందోళనలు లేకుండా కోర్టును ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయం ద్వారా న్యాయం చేయడం జరుగుతుందన్నారు. కోర్టు ప్రాంగణం నుంచి బళ్లగేటు సెంటర్ వరకు న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, న్యాయవాదులు తటవర్తి నాగరాజారావు, దాసరి సత్యనారాయణ, తిరుకోటి శాంతిసుధ, కేఆర్కే రాజు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, కేఎల్వీ ప్రసాదరావు, ఎం.అలీ, ముడే వెంకట్రావు, సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్, కోర్టు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ కార్యవర్గం ఎన్నిక

అమలాపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం శుక్రవారం అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర సంఘ అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేయాలన్నారు. అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను ఉమ్మడి జిల్లాశాఖ అధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా గుబ్బల మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడిగా సరిదే సత్యపల్లంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీనివాస్‌బాబు, ఆర్థిక కార్యదర్శి వాసా నాగవీరదుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా విన్నకోట శ్రీనివాసరావు, కారాడి వెంకటనరసింహరాజు, పేట వీరరాఘవులు, సహాయ కార్యదర్శులుగా సంసాని వేణు, కడలి వెంకటేశ్వర్లు, మొల్లేటి నాగవెంకటేశ్వరరావు, జిల్లా సలహాదారులుగా చొల్లంగి సత్యసాయిబాబా, విత్తనాల శ్రీనివాసరావు, బొక్కా వీరవెంకటేశ్వరరావు, చింతా సోమరాజులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రధాన పంటకాల్వలో చెట్లు తొలగింపు

పి.గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలోని పి.గన్నవరం ప్రధాన పంటకాల్వలో తుఫాన్ కారణంగా విరిగిన చెట్లను తొలగించినట్లు ఇరిగేషన్ డిఈ రవిప్రసాద్‌రాజు తెలిపారు. పి.గన్నవరంలో పంటకాల్వలో చెట్లు తొలగింపు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. తాటిపాక సెక్షన్ పరిధిలో ప్రధాన పంటకాల్వ, చిన్న కాల్వలో సుమారుగా 35 చెట్లు వరకు తుఫాన్ ప్రభావంతో పంటకాల్వలో పడిపోయినట్లు ఆయన వివరించారు. డీఈ వెంట పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్ ఛైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడమే ప్రజాదర్బార్ లక్ష్యం

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య

రాజోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువడమే ప్రజాదర్బార్ లక్ష్యమని రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. తాటిపాకలో జీఎస్ గార్డెన్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, డెల్టా ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ, ఆత్మ మాజీ ఛైర్మన్ అడబాల సాయిబాబు, అనుచూరి పురుషోత్తం, వర్ధినీడి బాబ్జి, రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, మామిడికుదురు సొసైటీ ఛైర్మన్ ఈలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి యువతకు రుణాలు

అమలాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాల పంపిణీపై అందజేయనున్నట్టు జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకురాలు జె.సత్యవతి తెలిపారు. ఆసక్తి కలిగి అనుభవంతో పాటు అర్హతలు గల అభ్యర్థులు నేరుగా దరఖాస్తులను అందించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా కాకినాడ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రగతి భవన్‌లో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐదుగురు కలసి గ్రూప్‌గా ఏర్పడాలి. వారికి సఫాయి కర్మచారి సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలి. ఐదుగురు గ్రూపు సభ్యులలో ఒకరికి విధిగా హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. సెప్టిక్ ట్యాంకు పథకం విలువలో సబ్సిడీ పోను మిగిలిన రుణాన్ని 6శాతం వడ్డీతో 72నెలలకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో వాయిదాకు రూ.33,064 చొప్పున క్రమం తప్పకుండా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 6281817023ను సంప్రదించాలన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

కాట్రేనికోన, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎస్ వెంకటాచలం విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందనకు హాజరుకాని ఉద్యోగులపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటలకు కూడా సచివాలయ ఉద్యోగులు కార్యాలయాలకు రాని వైనాన్ని సోషల్ మీడియా విస్తృత ప్రచారం చేస్తోందన్నారు. స్పందన సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలకు కారణాలు వివరిస్తూ నివేదిక ఇవ్వాలన్నారు. డిప్యూడీ ఎంపీడీవో శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

9న పాదలాడలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

రాజోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో పొదలాడ జీఎస్ గార్డెన్స్‌లో ఈ నెల 9న కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పొదలాడలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ తాటిపాక సెంటర్‌లో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్ చేతుల మీదుగా శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గస్థాయిలో యాదవ కార్తీక సమారాధన ఈనెల 9న రాజోలు టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు రాజోలు తాలూకా యాదవ సంఘ అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ తెలిపారు. 9న శివకోడు మంగెన గంగయ్యతెలగా కల్యాణమండపంలో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు.

'తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంది'



చేనేత కార్మికులకు తుఫాన్ సాయం అందజేస్తున్న కూటమి నాయకులు

కె.గంగవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచిందని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్ అన్నారు. శుక్రవారం శివలలో తుఫాన్ బాధిత చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యం, ఉల్లి, బంగాళదుంపలు, కందిపప్పు కిలో, లీటరు పామాయిల్, అరకిలో పంచ దారను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు బులసు శివప్రసాద్, సర్పంచ్ అనసూరి సాయి, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

డీఏపీ, యూరియా విక్రయించొద్దని నిర్ణయం

కె.గంగవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫెర్టిలైజర్ షాపుల్లో డీఏపీ, యూరియా విక్రయాలు చేయకూడదని ఆ షాపు యజమానుల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం కె.గంగవరంలో వారు సమావేశమయ్యారు. డీఏపీ, యూరియా సప్లై చేసే కంపెనీవారు డీఏపీ, యూరియా బస్తాలతో పాటు అదనపు ప్రొడెక్ట్‌లు అంటగడుతున్నారని వారంతా వాపోయారు. సమావేశంలో మండల ఫెర్టిలైజర్స్ షాపు యజమానుల యూనియన్ అధ్యక్షుడు నేమాని సత్యనారాయణ, కన్వీనర్ పోతంశెట్టి వీవీ సత్యనారాయణ (పెదబాబు), మానే రామారావు, సలాది భద్రరావు, ఎన్. సుబ్బారావు, మాచర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ




నైపుణ్య పోటీల్లో జ్ఞాపికలు అందుకుంటున్న మాచర హైస్కూల్ విద్యార్థినులు

కపిలేశ్వరపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాచర పీఎం శ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమలాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో పాఠశాల విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. నైపుణ్య పోటీల దుస్తుల ఎంబ్రాయిడరీ విభాగంలో పాల్గొన్న పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు గంగుమళ్ల దుర్గామహాలక్ష్మి, సుంకర ఉమాసత్యవేణి, ఊహ గంగాసిరి సూర్యక్రాంతి, ధనలక్ష్మి, రాజరాజేశ్వరి తయారు చేసి ప్రదర్శించిన దుస్తులను డీఈవో సలీం బాషా పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా దుస్తుల ఎంబ్రాయిడరీ విభాగంలో ప్రథమ స్థానంలో నిల్చిన విద్యార్థినులకు జీసీడీవో భీమారావు, ఏపీసీ మమ్మీ, ఈసీ రమేష్ జ్ఞాపికలు,ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థినులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో పాల్గొననున్నట్టు వృత్తివిద్యా శిక్షకురాలు లలిత తెలిపారు. ప్రథమస్థానంలో నిల్చిన విద్యార్థినులను ఎంఈవో 2 విజయ్‌కుమార్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నేటితో కూర్మాపురం సొసైటీ స్థాపించి 105 ఏళ్లు

● సహకార సంఘం శతాబ్ది భవనాన్ని ప్రారంభించనున్న మంత్రి అచ్చెన్న



కూర్మాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి

రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూర్మాపురం వట్టికూటి శేషమ్మ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏర్పడి ఈనెల 8వ తేదికి 105 సంవత్సరాలు పూర్తౌతున్న సందర్భంగా శనివారం వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు చేతులమీదుగా సహకార సంఘం శతాబ్ధి భవనాన్ని ప్రారంభించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి (కూర్మాపురం అబ్బు) తెలిపారు. శుక్రవారం కూర్మాపురంలో మాజీ ఎమ్మెల్సీ చౌదరి మాట్లాడుతూ మన దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం 1904లో అప్పుడప్పుడే ప్రారంభం అవుతుండగా 1920లో కూర్మాపురంలో తొమ్మిది మంది సభ్యులతో వట్టికూటి వీరవెంకన్న చౌదరి సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని, అందువల్ల కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.

జాతీయ క్యాన్సర్ దినోత్సవంపై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వందేమాతరం గీతాలాపన



మండపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఇతరులు



రాయవరంలో ..



కె.గంగవరంలో..

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) వందేమాతరం జాతీయగీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణం, రూరల్‌లో శుక్రవారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం, పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలోనూ జరిపారు.

రాయవరం: వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ జాతికి అంకితం చేసి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండలంలోని 12 గ్రామాల్లో శుక్రవారం వందేమాతరం సామూహిక గీతాలాపనలు ఆలపించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ నౌడు వెంకటరమణ బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు గీతాలాపనలు చేశారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వందేమాతరం 150 ఏళ్ల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 అడుగుల జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తి గీతాలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో 2 చోడిశెట్టి ఆంజనేయులు మాట్లాడుతూ వందేమాతరం మన దేశ స్వాతంత్రోద్యమానికి మూలాధారమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలల్లో వందేమాతర గీతాలాపన చేశారు.

కపిలేశ్వరపురం: వందేమాతరం గీతాన్ని బంకించంద్ర చటర్జీ రచించి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తికావడంతో మండలంలోని పలు పాఠశాలలు, కార్యాలయాల్లో పలువురు వక్తలు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ జీ. శ్రీనివాస్, అంగర వీహెచ్‌సీ వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బంది గీతాన్ని ఆలపించి విశిష్టతను వివరించారు. అలాగే అంగర రామకృష్ణ విద్యార్థులచే భారతమాతాకి జై అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షులు నామాల శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ మండల ప్రచారక దానేటి శరత్, వివిధశాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండపేట మండల సమావేశం

● పలు సమస్యలపై చర్చ
● తుఫాన్ సమయంలో అధికారులు వ్యవహరించిన తీరు భేష్ : ఎమ్మెల్యే వేగుళ్ల
● సమావేశానికి వైసీపీ ఎంపీటీసీల డుమ్మా



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండపేట మండల సమావేశం శుక్రవారం సాదాసీదాగా జరిగింది. దీనికి ఎంపీపీ ఉండమట్ల వాసు ఆధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైసీపీకి చెందిన 11 మంది ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. కోరం అవటంతో తొమ్మిది మంది సభ్యులు ఎంపీపీతో సహా హాజరు కావటంతో సమావేశాన్ని అధికారులు నిర్వహించారు.ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుపాన్ సమయంలో బాధ్యతతో పనిచేసిన అన్నిశాఖల అధికారులను ఆయన అభినందించారు. అలాగే ఎస్సీ కాలనీల్లో పనులకోసం నియోజకవర్గ స్థాయిలో రూ. 112 కోట్ల మేర ప్రతిపాదనలు అమలాపురం ఎంపీ జీవీ హరీష్‌మాధూర్‌కు అందజేశామన్నారు. ఆయన నిధులు ఇస్తానని చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ద్వారపూడి, కేశవరం, జెడ్.మేడపాడులో సాస్కీస్కీం పథకంలో రహదారులు నిర్మించేందుకు నిధులు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. అలాగే గ్రామాల్లోని పలుసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల వారీగా అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. అనంతరం కేశవరం ఆరోగ్యశాఖ వైద్యాధికారి అనుశ్రీ మాట్లాడూతూ క్యాన్సర్ వ్యాధి గురించి వివరించటంతోపాటు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. తర్వాత ఏడిద పశుసంవర్ధక శాఖాధికారి సతీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ , ఉపాధి ఏపీఎం, మండపేట తహశీల్దార్ పి.తేజేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ వాసు, వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, ఎంఎసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, తహశీల్దార్ తేజేశ్వరరావు, డిప్యూటి ఎంపీడీవో దాసరిశ్రీనువాస్, పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు సత్కారం

మండపేట నియోజకవర్గాన్ని కోనసీమ నుంచి రాజమహేంద్రవరంలో కలిపేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించటంతో అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వేగుళ్లను సమావేశంలో ఎంపీపీ వాసు, అధికారులు సత్కరించారు.

మండపేటను రాజమహేంద్రవరంలో కలిపిన ఘనత వేగుళ్లదే

● జేఏసీ నాయకులు



వేగుళ్లను సత్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్షను నిజం చేసిన ఘనత ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుదేనని అఖిలపక్ష జేఏసీ నాయకులు అన్నారు. ఇప్పటివరకు కోనసీమ జిల్లాలో కొనసాగుతున్న మండపేటనియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో కలుపేందుకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో శుక్రవారం అఖిలక్ష జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పార్టీలకు అతీతంగా పోరాడినప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన వేగుళ్ల ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో విజయం సాధించటం హర్షణీయమన్నారు. వేగుళ్లను కలిసినవారిలో జేఏసీ కన్వీనర్ కామన ప్రబాకరరావు, రెడ్డి రాధాకృష్ణ, కోనాసత్యనారాయణ, ఎండీఖరీం కె.కృష్ణవేణి, కాశీన కాశీవిశ్వనాథం, గుండు తాతరాజు, వాదాప్రసాదరావు, శివకోటి శేషసుబ్రహ్మణ్యం, వల్లభనేని రవీంద్రబాబు, వీరమల్లు శ్రీనువాస్, తదితరులు ఉన్నారు.

పంటకోత ప్రయోగం



మాచవరంలో పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాచవరంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన గొలుగూరి నారాయణరెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, మేడపాటి సత్తిరెడ్డి, మేడపాటి శ్రీధర్‌రెడ్డికు చెందిన పొలాల్లో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటకోత చేశారు. ఇందులో 75 కేజీల బస్తాలు 15 బస్తాలు దిగుబడి సాధించిందన్నారు. మొంథా తుఫాన్ కారణంగా 25-50 శాతం వరకు దిగుబడి తగ్గింపు నమోదయ్యాయని ఏవో కేవీఎస్ రమేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే బండారు
» రావులపాలెంలో ప్రజాదర్బార్



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెంలోని టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి 161 వినతులు స్వీకరించారు.వాటిని పరిష్కారానికి సత్వరమే సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తోందన్నారు.

వైసీపీవి అసత్య ప్రచారాలు

వైసీపీ నేతలు నిరంతరం ఏదొక సాకుతో చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతులు నష్టపోతే వారికి అండగా నిలవాల్సింది పోయి పరామర్శల పేరుతో మాజీ సీఎం జగన్ బలప్రదర్శన చేసుకుంటున్నారని, వైసీపీ నాయకులు రాజకీయ ప్రదర్శనలతో బిజీగా గడుపుతున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తుంటే జగన్ ఆరోపణలతో రాజకీయాలు చేయడంలో నిమగ్నమయ్యారన్నారు. వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ, నకిలీ మద్యం డ్రామాలు ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలి

కొత్తపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట-వాడపాలెం రహదారి విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. శుక్రవారం రోడ్డు విస్తరణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.విద్యుత్ శాఖ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో లైన్ షిఫ్టింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీను, దేవపాటి వెంకటేశ్వరరావు, తమ్మన సాయిప్రసాద్, బండారు బుల్లితాత, ఏడీఈ చిట్టిరాజు, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

వందేమాతరం..అజరామర నినాదం

» ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
» వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు
» పలుచోట్ల సామూహిక గేయాలాపన



హసన్‌బాదలో 150 కూర్పుగా విద్యార్థుల ప్రదర్శన

కొత్తపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమరచరిత్రలో అజరామరమైన నినాదం వందేమాతరమని, అది కేవలం పదం కాదు దేశ భక్తి జ్వాలను రగిలించిన ఒక భావజాలమని ఎమ్మెల్యే బండారు సత్యనందరావు పేర్కొన్నారు. వందేమాతరం 150 వసంతాలు వేడుకలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాడపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులతో కలిసి వందేమాతర గేయాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం పోషించిన కీలకపాత్రను గుర్తుచేశారు. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ సుంకర మురళీమోహన్ గేయ రచయిత బకిం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.నరేష్‌కుమార్, ఎంఈవో ఎం.హరిప్రసాద్, గనిశెట్టి వీరేష్, చవల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బండారు వీరబాబు పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గేయం బ్రిటీష్ పాలకులను సైతం వణికుంచిందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వందేమాతర గేయాన్ని ఆలపించారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వందేమాతర గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఎంపీడీవో వెంకటరామన్ మాట్లాడుతూ తొలి బెంగాళి ఐపీఎస్ అధికారి ఛటర్జీ 150 ఏళ్ల క్రితం వందేమాతర గేయాన్ని రచించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీవీ ఆర్కే రాజు, ఎంఈవో ప్రసాదరావు, ఏపీవో విజయారెడ్డి, ఏపీఎం గంగాధర్, సిబ్బంది, మహిళలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, ఇతర ఉద్యోగులు, సిబ్బంది వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె వందేమాతర గేయం స్వాతంత్ర్య సమరంలో నింపిన స్ఫూర్తిని వివరించారు. హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం అని రాసి 150 సంఖ్య కూర్పుగా ప్రదర్శించారు. అనంతరం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, హెచ్ఎం పీబీఎస్‌కే సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మెరుగైన వైద్యసేవలు అందించండి

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తనిఖీలో ఆర్డీవో అఖిల



ఏరియా ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో సామాన్యులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆర్డీవో దేవరకొండ అఖిల సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆర్డీవో ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వ, ఆసుపత్రిలో పరిశుభ్రత పరిశీలించారు. లోపాలను గుర్తించి సరిదిద్దేందుకు ఆదేశాలు జారీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అత్యవసర వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓపీ నమోదుకు సమయం అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది సంఖ్యల, పోస్టులు ఖాళీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎముకలు, చర్మవ్యాధుల వైద్యుల కొరత కారణంగా చాలా కేసులు కాకినాడ పంపుతున్నట్టు తేలిందని, పోస్టులు భర్తీ చేయాలని డీఎస్‌హెచ్ఎస్‌ని ఆదేశించారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని వైద్యులను, సిబ్బందిని హెచ్చరించారు. మానవత దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. ప్రవీణ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గొల్లపల్లి కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

మనమిత్ర యాప్‌తో బహుళ ప్రయోజనాలు

ఆలమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలను నేరుగా ఇంటి నుంచే పొందే విధంగా మన మిత్ర యాప్‌ను అందుబాటులోనికి తీసుకొచ్చిందని, ఈ యాప్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీపీడీవో ఎ.రాజు తెలిపారు. మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో శుక్రవారం మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజుతోపాటు పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు ఇంటింటికీ వెళ్లి మన మిత్ర యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడు చేసి యాప్‌ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. మనమిత్ర యాప్ ద్వారా దాదాపు వంద పథకాలు నేరుగా ఇంటి నుంచి పొందే విధంగా అందుబాటులో ఉన్నాయన్నారు. యాప్‌ను ప్రతీ ఒకరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బంది, మోదుకూరు సహకార సంఘం అధ్యక్షుడు ఈదల వీర్రాజుచౌదరిలతో కలిసి పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వెంకన్న అన్నదాన పథకానికి రూ.75 వేలు విరాళం

ఆత్రేయపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యే పూజలు చేశారు. ఆలయంలో చేపడుతున్న నిత్య అన్నదాన పథకానికి జంగారెడ్డిగూడేనికి చెందిన కూచిభోట్ల వెంకట ప్రభాకర్‌కుమార్- సీతాకుమారి దంపతులు రూ.75,001 విరాళం సమర్పించారు.దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ చేశారు.

5 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం గ్రామశివారున శుక్రవారం సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. జొన్న రాములును 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

వలీవల స్వస్థత సభలు

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఈతకోట-గంటి రోడ్డులో ఉన్న వలీవల స్వస్థత శాల 10వ వార్షికోత్సవం పాస్టర్ పమ్మి అమృతరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రసంగీకులుగా పాస్టర్ బీర శామ్యూల్‌రాజు విచ్చేసి వాక్యోపదేశం చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడారు. క్రీస్తు మార్గంలో నడిచేవారు కరుణ, దయ, శాంతి సన్మార్గాలను ఎంచుకోవాలని చెప్పారు.

నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలి

భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనరు, డీఈవో సలీంబాషా



వెదిరేశ్వరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్కౌట్, అండ్ గైడ్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలకు ప్రాధన్యత ఇవ్వాలని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనరు, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు.రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 3వతేదీ నుండి నిర్వహిస్తున్న ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 28 పీఎం శ్రీ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కోర్స్ కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన 91 మంది గైడ్ కెప్టెన్స్ ట్రైనింగ్ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ జె.రాజకుమార్, ఎంఈవోలు ఆర్.నాగవెంకటకుమార్, పి.శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్ఎం జానకీదేవి పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రత, ఇష్టంతో విద్యనభ్యసించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పాఠ్యంశాలను క్షుణంగా అర్థం చేసుకుని సత్ఫలితాలు సాధించాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ సుబ్బాయమ్మ.. పాఠశాలకు ప్రహరి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు భోజనాలు

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని అంధుల పాఠశాల, ఊబలంకలోని మదర్ థెరిస్సా ఆశ్రమంలోని పిల్లలకు భోజనాలు, బిస్కెట్లు, పండ్లు అందజేశారు. రావులపాలేనికి చెందిన విక్టరీ సంస్థల అధినేత గొలుగూరి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. పలువురు పాల్గొన్నారు.

హసన్‌బాదలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయంలో శుక్రవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరిగింది. ఆలయార్చకులు, వేద పండితులు..దాత సత్తిసుబ్బారెడ్డి,సీతారత్నం దంపతులతో ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి వి.సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోటత్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.